క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

• సీఐ సంగమేశ్వరరావు



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

పొదలకూరు : వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు, మండపాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరిగా ఉండాలని సీఐ జీ.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరిముల్లా పేర్కొన్నారు. పొదలకూరు సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందిగా సూచించారు. బలవంతపు వసూళ్లు, దర్శన టికెట్లు, చందాలు ఉండకూడదన్నారు. డీఎస్పీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే ముందు పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్‌శాఖల అనుమతులు జత చేయాలన్నారు. ఉత్సవాల నిర్వహణ తేదీలు, సమయం తదితర సమాచారాన్ని పొందుపరచాల్సిందిగా సూచించారు. కమిటీ సభ్యులు రాత్రివేళల్లో మండపాల వద్ద కాపలా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే విధంగా ఊరేగింపులు నిర్వహించరాదని, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



మాట్లాడుతున్న అదానీ ట్రస్టు ప్రతినిధులు

ముత్తుకూరు : విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలియజేస్తే ఆ రంగంలోని నిష్ణాతుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అదానీ ట్రస్టు ప్రతినిధులు అన్నారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు శ్రీనివాస్, మోహిత్, బాలచంద్ర తదితరులు మాట్లాడారు. విద్యార్థులు కోరిన రంగాల్లో రాణించాలంటే ఆయా రంగాల్లో విజయం సాధించిన వ్యక్తుల ద్వారా ప్రత్యేక చర్చా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హైస్కూల్‌లో చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేసే ఆలపాక మానస విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

• పకడ్బందీగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
• సచివాలయ, వైద్యసిబ్బందికి అధికారుల సూచనలు



పొదలకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నగేష్‌కుమారి

పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఇందులో భాగంగా మండలంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తించాలని ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య సురక్షపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి సిబ్బంది ఆరోగ్య సమస్యలను గుర్తించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాల్సిందిగా సూచించారు. ఈనెల 30 నుంచి అక్టోబరు 28వ తేదీ వరకు సచివాలయాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా వైద్యపరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. కావున గ్రామాల్లో ప్రజల ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి ఆరోగ్య సమస్యలు ఉంటే వివరాలు వెల్లడించాల్సిందిగా సూచించారు. వైద్యశిబిరం నిర్వహించే ముందురోజు గ్రామంలో ప్రజలందరికీ తెలియజేస్తామని, ఈ శిబిరానికి రోగులను వలంటీర్లు తీసుకువస్తారని వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు, వైద్యాధికారులు వి.నరసింహారావు, కిరణ్‌రిషిత, కావ్య, విస్తరణాధికారి రవికుమార్, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ రమణమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

30 నుంచి ప్రారంభం

కొడవలూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని దామేగుంట సచివాలయంలో వైద్య, సచివాలయ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులతో కూడిన బృందం గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. దీనికి 15 రోజుల ముందు ఆయా గ్రామాల్లో వలంటీర్లు, వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారన్నారు. ఈ మేరకు 30వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. బీపీ, షుగర్ లాంటి పరీక్షలతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను సైతం గుర్తించి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆరోగ్య సమస్యలను గుర్తించి స్థానికంగా పరిష్కారమయ్యే సమస్యలకు పీహెచ్‌సీల్లోనే వైద్యం అందిస్తారని, తీవ్రమైన ఆరోగ్య



కొడవలూరు: సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

సమస్యలకు జిల్లా ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తారన్నారు. ఆరోగ్య సురక్ష బృందాలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టి.సురేష్, పి.సురేష్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సకల సౌకర్యాలతో నిర్మించాలి



పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : పట్టణ నడిబొడ్డున ఉన్న స్థలంలో పంచాయతీ భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మించాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనాన్ని మంత్రి కాకాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నుడా, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ పంచాయతీ భవనానికి మంచి స్థలం లభించిందన్నారు. భవిష్యత్తులో పొదలకూరు పంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందే అవకాశం ఉన్నందున అన్నిరకాల సౌకర్యాలు ఉండేలా భవనాన్ని పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. ఇందుకోసం అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేసేందుకు నుడా నుంచి రూ.17 లక్షల నిధులను కేటాయించామని వివరించారు. మంత్రి వెంట సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి, భారతమ్మ, వార్డుసభ్యులు అనూరాధ, విజయలక్ష్మి, ఎస్‌కే అంజాద్, సరోజనమ్మ, ఎం.సతీష్‌రెడ్డి, హేమంత్, జయమూర్తిరెడ్డి, భాస్కర్, హరి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఎంఈఓకు సన్మానం

తోటపల్లిగూడూరు : జిల్లాస్థాయిలో ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా అవార్డు అందుకున్న సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డికి బుధవారం ఘన సన్మానం జరిగింది. చిన్నచెరుకూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పాఠశాల సిబ్బంది కలిసి వేణుగోపాలరెడ్డిని పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల చిన్నారులచే ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ-2 జయరామనాయుడు, పాఠశాల హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయినులు వసంతలక్ష్మి, విద్యుల్లత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న ఎంఈఓ వేణుగోపాలరెడ్డి

కొత్త పింఛన్ల అందజేత

మనుబోలు : మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాల సచివాలయాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. మనుబోలు మండలంలో కొత్తగా 358 పింఛన్లు మంజూరయ్యాయి. వీటితో కలిపి మండలంలో మొత్తం 5,595 మంది పింఛన్‌దారులు ఉన్నారు. కాగా కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, గుంజి రమేష్, దాసరి భాస్కరగౌడ్, ముంగర రవీంధర్‌రెడ్డి, ఏలూరు భాస్కర్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ నగదు అందజేస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగంలో బుచ్చి వాసి



శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ నూతన ఐటీ విభాగంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముమ్మడి శ్రీనివాసులురెడ్డి కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐటీ విభాగంలో తనను ఎంపిక చేశారని తెలిపారు. ఇందుకు సహకరించి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షుడు సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

పొదలకూరు : మండలంలోని నావూరు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గ్రామోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీకృష్ణభగవానుడు మనిషిగా జన్మించి నడయాడినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఊరేగింపులో ఆ సమితి పొదలకూరు మండల అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణయ్య, పెంచలయ్య, గోపీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా సాగుతున్న ఊరేగింపు

ప్రత్యామ్నాయ పంటల సాగే మేలు

• రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగమణి

పొదలకూరు : వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగే మేలని శాస్త్రవేత్తలు పి.నాగమణి, ఒ.వెంకటేశ్వర్లు సూచించారు. పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానంలో ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు మెట్టపైర్లను సాగు చేయాల్సిందిగా సలహాలు ఇచ్చారు. ఆముదం, ఉలవ, అలసంద పైర్లకు బెట్టను తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులు రైతులకు ప్రధాన సమస్యగా మారిందని, పెట్టుబడులను తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. లింగాకర్షక బుట్టలు, తెలుపు, పసుపు జిగురు అట్టలు, ఎరపంటల గురించి చర్చించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టలు, పసుపు అట్టలు పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త పి.సత్యవాణి అపరాలసాగులో తెగుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి మాట్లాడారు. ఏడీఏ లక్ష్మీమాధవి విత్తనశుద్ధి, పచ్చిరొట్ట ఎరువులపై సలహాలు ఇచ్చారు. ఏఓటీ చక్రవర్తి భూసార పరీక్షలు, ఉపయోగాల గురించి వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు, అగ్రిల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల పరీక్షలపై పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, ఏపీఎంఐ పీడీ బి.శ్రీనివాసులు పాల్గొని సలహాలు, సూచనలు చేశారు.

నార్తురాజుపాళెంలో వైఎస్సార్ కాంస్య విగ్రహం

• రూ.7.50 లక్షలతో కొనుగోలు
• త్వరలో ఏర్పాటుకు సన్నాహాలు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం-బుచ్చి రోడ్డు కూడలిలో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడి కూడలిలో సెంటర్ లైటింగ్ పనుల్లో భాగంగా గతంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చింది. ఆ స్థానంలో శాశ్వతంగా ఉండేలా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు భావించారు. ఈ విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు పశ్చిమగోదావరి జిల్లా నత్తా రామేశ్వరంలో ఉన్న ఏకే ఆర్ట్ స్టూడియోకు ఆయన బుధవారం వెళ్లి ఏడు అడుగుల కాంస్య విగ్రహాన్ని రూ.7.50 లక్షలకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ నార్తురాజుపాళెంలో గతంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం స్థానంలో శాశ్వతంగా ఉండిపోయేలా ఏడు అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏర్పాటు తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కొండా శ్రీనివాసులురెడ్డి, నెలవాయి మాణిక్యరావు, మోచర్ల రమేష్ ఉన్నారు.



నత్తా రామేశ్వరంలో చలపతిరావు, నాయకులు

చిరుధాన్యాల్లో మెండుగా పోషకాలు



కొడవలూరు: కొత్తవంగల్లులో పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ అరుణ



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల

• ఏసీడీపీఓ టి.అరుణ

కొడవలూరు : చిరుధాన్యాల్లో పోషకాలు మెండుగా ఉంటాయని ఏసీడీపీఓ టి.అరుణ సూచించారు. మండలంలోని కొత్తవంగల్లులో పోషణ్ మహా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి.పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, ఏఎన్‌ఎం శాంతకుమారి, డీఏ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, సుప్రజ, కుమారి, సుజాత, వెంకటరమణమ్మ, విజయ, మాధవి, పద్మ పాల్గొన్నారు.

➡ గండవరం మజరా గుర్రాలదిన్నెలో పోషకాహార ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, ఏఎన్‌ఎం టి.రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, లక్ష్మీప్రసన్న, దేవసేనమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

➡ వెంకన్నపురంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ మందపల్లి మల్లికార్జున, సర్పంచ్ పెంచలయ్య, హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం : మంచి పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని సర్పంచ్ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని మునులపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ శకుంతల, కార్యదర్శి రమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయిని గిరిజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మనుబోలు : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీడీ వసంతకుమారి



ఇందుకూరుపేట : వాలీబాల్ పోటీలో విద్యార్థులు



పొదలకూరు : స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం: వాలీబాల్ ఆడుతున్న బాలికలు

మనుబోలు : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ రమేష్‌కుమార్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. తొలుత పీడీ ప్రమీళారాణి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక వ్యాయామంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, యోగా, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు శుశ్రుత ప్రైవేటు పాఠశాల విద్యార్థులు కూడా పోటీల్లో పాల్గొన్నారు. ఆపై మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఎన్నికైన జట్లకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు సరిత, కామాక్షి, మధుసూదన్‌రావు, మురళి, మనుబోలు పాఠశాలల హెచ్‌ఎంలు డేవిడ్, వసంతకుమారి పాల్గొన్నారు.

మహ్మదాపురం హైస్కూల్లో..

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం హైస్కూల్లో బుధవారం జరిగిన మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఎంపికలో పట్టణంలోని విజేత స్కూల్ విద్యార్థులు ప్రతిభకనపరిచారు. హైజంప్ బాలుర విభాగంలో ఎం.విశ్వాస్(9వతరగతి) ప్రథమ స్థానం, బి.జ్యోతిరాదిత్య(టెన్త్) ద్వితీయస్థానం కైవశం చేసుకున్నారు. 400 మీటర్ల పరుగుపందెంలో ఎ.శివకుమార్(టెన్త్) ద్వితీయ స్థానం, బాలికల విభాగం 1,500 మీటర్ల పరుగు పందెంలో బి.కావ్యప్రనైనా(టెన్త్) తృతీయస్థానం, షాట్‌పుట్ బాలుర విభాగంలో ఎ.శివకుమార్ తృతీయస్థానం సాధించారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుచ్చిరెడ్డిపాళెం : క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య అన్నారు. మండలంలోని పెనుబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడుతాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారని, గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు దిలీప్, రత్నం, హెచ్‌ఎం అనంతకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా జట్లను బుధవారం ఎంపిక చేశారు. తొలుత ఎంఈఓలు ఎస్.వెంకటనాయక్, ఎంవీ సునీల్‌కుమార్, హెచ్‌ఎం వి.మల్లికార్జున హాజరై పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ ఎంపికలకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్ జట్లను ఎంపిక చేశారు. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు తెలిపారు. పీడీలు కె.అరోరా, ఎస్‌కే ముజీర్, ఎన్.ప్రసాద్, వెంకటకృష్ణ, సుందర్‌బాబు, జ్యోతి, రేణుక పాల్గొని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



బుచ్చిరెడ్డిపాళెం: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పెంచలయ్య



బుచ్చిరెడ్డిపాళెం: ప్రతిభ చూపిన విద్యార్థులు



ఇందుకూరుపేట : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓలు

ఎర్రగుంటకు మంత్రి కాకాణి రాక నేడు

వెంకటాచలం : మండలంలోని ఎర్రగుంట గ్రామానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూనిటీ హాలుకు చేరుకుని మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి వద్ద బుధవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్ పనినిమిత్తం కృష్ణపట్నం పోర్టుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జగదేవిపేటలో విద్యుత్ అంతరాయం

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేటలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ టి.రమేష్‌బాబు బుధవారం తెలిపారు. విద్యుత్ కండక్టర్ మార్పు నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.